ఈనాడు జనగామ

సోమవారం అక్టోబరు 21, 2024


మధ్యలోనే ఆగిన నిర్మాణ పనులు


ప్రమాదకరంగా వాహనాల రాకపోకలు


దిగబడిన లారీ

అసంపూర్తి వంతెన.. అవస్థల ప్రయాణం!

జనగామ, న్యూస్‌టుడే: ప్రమాదాలు జరిగి ప్రాణాలు పోయిన పిదప బాధిత కుటుంబాలకు పరామర్శలు, పలకరింపులు, పరిహారాల హామీలు ఇవ్వడం కంటే, ప్రాణాంతకంగా మారిన రహదారులను బాగు చేయడం అన్ని వర్గాలకు శ్రేయస్కరం. జనగామ-హుస్నాబాద్ రహదారి గానుగుపహాడ్ వాగు వద్ద రెండేళ్ల క్రితం వంతెన నిర్మాణ పనులు చేపట్టారు. దాదాపు 80 శాతం పూర్తి అయ్యాక, బిల్లులు రాక గుత్తేదారు మధ్యలోనే నిలిపివేశారు. రాకపోకలకు పక్కనే ఏర్పాటు చేసిన తాత్కాలిక మట్టిదారి వరుస వర్షాలకు కొట్టుకుపోగా, మరమ్మతు చేసి పునరుద్ధరించారు. అడపా దడపా కురుస్తున్న వర్షాలకు ప్రమాదకరంగా మారింది. తాజాగా శనివారం అర్ధరాత్రి తరిగొప్పుల నుంచి జనగామకు వస్తున్న ఓ లారీ దారితప్పి మట్టిలో కూరుకుపోయింది. మరో పది అడుగులు ముందుకు వెళ్తే ప్రమాదం జరిగి వాగులో పడేదే. స్కూలు బస్సులు, ఆర్టీసీ బస్సులు, భారీ వాహనాలు వందలాదిగా ప్రయాణించే దారిపై ఎన్నికల సమయంలో ప్రస్తుత ఎమ్మెల్యే, ఎంపీ హామీలిచ్చినా, ముందుకు కదలడం లేదు. ఈ విషయాన్ని 'న్యూస్‌టుడే' నిర్మాణ ఏజెన్సీ దృష్టికి తీసుకెళ్లగా, పనులు పునః ప్రారంభమయ్యేలా చూడాలని సమస్యను కలెక్టర్ తదితరుల దృష్టికి తీసుకెళ్లనున్నామని తెలిపారు.

చతికిలబడ్డ క్రమబద్ధీకరణ


జనగామ మున్సిపల్ పరిధిలో స్థల పరిశీలనలో అధికారులు

జనగామ, న్యూస్‌టుడే: లేఔట్ నిబంధనలకు విరుద్ధంగా వెలసిన వెంచర్లలో కొనుగోలు చేసిన స్థలాలు, అనుమతి లేని ప్లాట్ల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం ప్రత్యేక అవకాశం కల్పించింది. గత ప్రభుత్వ హయాంలో క్రమబద్ధీకరణకు దరఖాస్తులను ఆహ్వానించారు. గతంలో రూ.1000 ఫీజుగా రుసుం చెల్లించి అవకాశాన్ని వినియోగించుకున్నారు. జిల్లాలోని 12 మండలాల పరిధిలో 61219 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో నిషేధిత భూముల్లో ఉన్న 5102 దరఖాస్తులకు అవకాశం లేదు. సుమారు 55 వేల దరఖాస్తులను పరిష్కరించనున్నారు. దీనికి తోడు పురపాలిక, మండల స్థాయి అధికారులు సమాచారం అందించినా స్పందించడం లేదు. మూడు మాసాల్లో ప్రక్రియ పూర్తి కావాల్సి ఉన్నా అర్జీదారులు ముందుకు రావడం లేదు.

☛ గతంలో దరఖాస్తు చేసిన వారు అనేక మంది స్థలాలను చేతులు మారాయి. కొందరు ఆ స్థలాల్లో ప్రత్యేక రుసుం చెల్లించి ఇల్లు కట్టుకున్నారు. మరికొందరు తాము స్థానికంగా ఉండటం లేదని, తర్వాత పరిష్కరించుకుంటామని పలు కారణాలు చెబుతున్నారు.

జిల్లాలో అత్యధికంగా పెండింగ్‌లో ఉన్న జనగామ మున్సిపల్ పరిధిలో ప్రక్రియ వేగవంతం చేసేందుకు వార్డు యూనిట్‌గా కార్యాలయ సిబ్బంది, అధికారులకు మొదటి దశ పరిశీలన బాధ్యతలను అప్పగించారు. మెప్మా ప్రతినిధులు వార్డుల వారీగా అర్జీదారులను కలిసి అవకాశాన్ని ఉపయోగించుకునేలా ప్రోత్సహించేందుకు కార్యాచరణ రూపొందించినట్లు కమిషనర్ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు.

వివాదాల చిక్కుముళ్లు..

స్థలాల యాజమాన్య హక్కులు, డబుల్ రిజిస్ట్రేషన్లు, సరిహద్దు వివాదం, తదితర కారణాలతో ఒక సర్వే నంబరులోని స్థలంపై కోర్టు కేసులు ఉన్నాయి. ఒకటి రెండు ప్లాట్లపై కేసులు వేసినా మొత్తం సర్వే నెంబరులోని ప్లాట్లను క్రమబద్ధీకరించలేకపోతున్నారు. బృహత్ ప్రణాళికలో భూ వినియోగ జోన్ల నిబంధనలు, ఆంక్షల కారణంగా అనేక దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నట్లు సమాచారం.

☛ పట్టణ పరిధిలో 18 వేల పైచిలుకు దరఖాస్తులలో 891 అర్జీలు తిరస్కరించారు. 568 ప్లాట్లపాల జాబితాలో చేర్చారు. అవసరమైన ధ్రువపత్రాలను సమర్పిస్తే పరిష్కరించనున్నారు. 196 ప్లాట్లకు సంబంధించి మూడు దశలుగా పరిశీలించారు. రూ. 7.18 లక్షల రుసుం వసూలు కావాల్సి ఉంది. పంచాయతీల పరిధిలో 1500 అర్జీలు పరిశీలించారు. జిల్లాలో ప్రస్తుతం వ్యక్తిగత స్థలాల క్రమబద్ధీకరణపై దృష్టిపెట్టారు. గతంలో 72 వెంచర్ల క్రమబద్ధీకరణకు దరఖాస్తులు అందాయి. వీటిపై స్పష్టత రావాల్సి ఉందని అధికారులు చెబుతున్నారు.

అధికారుల కొరత..


జనగామ మున్సిపల్ పరిధిలో, మండలాల్లో ఎల్‌ఆర్ఎస్ క్రమబద్ధీకరణ అధికారుల కొరత ఆటంకంగా మారింది. పట్టణ ప్రణాళిక విభాగంలో ఆరు పోస్టులకు ఇద్దరు టీపీఎస్‌లు ఉన్నారు. వీరు మూడు రోజులు ఇక్కడ, మరో మూడు రోజులు ఇతర చోట్ల విధులు నిర్వహించాలి. ఒకరు ప్రత్యేక సెలవుపై వెళ్లడంతో కష్టంగా మారింది. జనగామ మున్సిపల్ పరిధిలో ఎల్-1 పూర్తి కాగా, రెవెన్యూ శాఖ ధ్రువీకరణలో జాప్యం జరుగుతోంది.

నేడు మార్కెట్లో క్రయ విక్రయాలు బంద్

జనగామ, న్యూస్‌టుడే: జనగామ వ్యవసాయ మార్కెట్‌యార్డులో అడ్తీదారులు రైతులకు చెల్లింపులు జరపలేకపోతున్నందున సెలవు ప్రకటించాలని వినతిపత్రం సమర్పించగా, వారి విజ్ఞప్తిని ఉన్నతాధికారులకు వివరించి నేడు(సోమవారం) సెలవుకు అనుమతి తీసుకున్నామని మార్కెట్ కార్యదర్శి శ్రీనివాస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం సాధారణ, సోమవారం ప్రత్యేక సెలవుతో శనివారం సాయంత్రం నుంచి మార్కెట్లో ధాన్యం పోస్తున్న రైతులకు తిప్పలు తప్పేలా లేవు.

పెద్దదిక్కు లేక.. కన్నీళ్లు ఆగక!

అన్నదాతల ఆత్మహత్యలు.. కుటుంబాల్లో కల్లోలం



ఆరుగాలం కష్టపడుతూ.. చెమట ధారలతో నేలను తడుపుతూ సాగునే నమ్ముకున్న అన్నదాతలు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. పెరుగుతున్న సాగు పెట్టుబడులు.. కుటుంబ పోషణ.. పిల్లల చదువులు.. వైద్య ఖర్చులకు చేస్తున్న అప్పులు తీరక తీవ్ర మనోవేదన చెందుతున్నారు. ఉమ్మడి జిల్లాలో ఈ పది నెలల కాలంలో దాదాపు 25 మంది దాకా బలవన్మరణాలకు పాల్పడటం కలవరపెడుతోంది. వీరిలో కౌలు రైతులు కూడా ఉన్నారు. యువ రైతులు సైతం బలవన్మరణం చెందడంతో చిన్నతనంలోనే వితంతువులుగా మారిన మహిళలు అప్పులు ఎలా తీర్చాలో.. పిల్లలను ఎలా పెంచి పెద్దచేయాలో తెలియక తల్లడిల్లుతున్నారు. ఈ నేపథ్యంలో కుటుంబ పెద్ద దిక్కును కోల్పోయిన కుటుంబాల దయనీయ పరిస్థితిపై కథనం.

ఈనాడు, మహబూబాబాద్

కౌలు రైతు కుటుంబం.. కష్టాలపాలు



వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం కొత్తపల్లికి చెందిన పోశాల రాజబాబు(45) వ్యవసాయంపై మక్కువతో పదేళ్లుగా మూడెకరాలు కౌలుకు తీసుకుని పంటల సాగు చేసేవారు. ఆశించిన దిగుబడులు రాక, అప్పులు పెరిగి సుమారు రూ.15 లక్షలకు చేరాయి. కుటుంబ పోషణ భారంగా మారడంతో రాజబాబు మద్యానికి బానిసయ్యారు. ఈ క్రమంలో ఈ నెల 16వ తేదీ రాత్రి గ్రామ శివారులోని చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. కుమారులు సుశాంత్, అభిరామ్ చదువుల ఖర్చులతోపాటు అప్పులను తీర్చే బాధ్యత తనపై పడిందని.. కూలీ పనులకు వెళ్లినా కష్టాలు తీరేలా లేవని భార్య సువర్ణ రోదిస్తోంది. – వర్ధన్నపేట

అప్పులోళ్ల ఒత్తిడి భరించలేక..



వరంగల్ జిల్లా గీసుకొండ మండలం ఆరెపల్లికి చెందిన గువ్వాడి మోహన్‌రావు(32), భార్య కృష్ణవేణి (28) మూడెకరాల్లో పత్తి, మొక్కజొన్న సాగు చేసేవారు.. దీంతోపాటు మోహన్‌రావు వరంగల్‌లోని ఒక హోటల్‌లో పనిచేస్తుండేవారు. సాగు పనులకు రూ.3 లక్షల మేర అప్పు చేశారు. మోహన్‌రావు రోజు పనికి వెళ్లిన తర్వాత.. అప్పులోళ్లు ఇంటికి వచ్చి అడుగుతుండటంతో భార్యాభర్తల మధ్య గొడవకు దారితీసింది. అప్పులు తీర్చే మార్గం లేక మార్చి 3న పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డారు. దిక్కుతోచని పరిస్థితిలో కృష్ణవేణి ఐదేళ్లు, రెండున్నరేళ్ల పిల్లలను నాన్నమ్మ వద్ద ఉంచి కూలీకి వెళ్తోంది. – గీసుకొండ

అప్పుడు కూతురు.. ఇప్పుడు తండ్రి



భూపాలపల్లి జిల్లా కాటారానికి చెందిన కొండ రాజబాపు(45) కౌలు రైతు.. నాలుగెకరాలు కౌలుకు తీసుకొని పత్తి వేశారు. సుమారు రూ. 11 లక్షలకు పైగా అప్పులు చేయాల్సి వచ్చింది. ఆశించిన దిగుబడులు రాకపోవడం.. కుటుంబ పోషణ భారమవుతోందనే వేదనతో రాజబాపు పురుగు మందుతాగి ఈ నెల 6న మృతి చెందారు. మూడేళ్ల కిందట పదో తరగతి చదువుతున్న కూతురు.. ఇప్పుడు ఇంటి యజమాని ఆత్మహత్య చేసుకోవడం కుటుంబానికి తీరని లోటుగా మారింది. అప్పులు, కుమారుడికి చదువులు చెప్పించే బాధ్యత భార్య రాజేశ్వరిపై పడింది. కష్టాలు గట్టెక్కేందుకు గ్రామంలో కూరగాయలు విక్రయిస్తున్నానని.. కన్నీరు పెట్టుకుంది. –కాటారం

నమ్ముకున్న చేనులోనే..



భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం పల్గుల గ్రామానికి చెందిన పలిశెట్టి మొండయ్య(45) అరెకరం భూమిలో పత్తి సాగు చేసేవారు. భార్య లావణ్య కూలి పనులకు వెళ్లేది. మూడేళ్ల నుంచి గోదావరి వరద ముంపుతో సాగు చేసిన పత్తిలో దిగుబడులు రాక అప్పుల ఊబిలో కూరుకుపోయారు. పెట్టుబడి, ఇంటి పోషణకు చేసిన రూ.8 లక్షల అప్పులో రూ.4 లక్షలు తీర్చారు. మిగతావి తీర్చేందుకు ఇబ్బందులు ఎదురవడంతో మనోధైర్యం కోల్పోయిన మొండయ్య పంట చేలోనే చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డారు. లావణ్య బాధను దిగమింగుతూ రోజూ కూలీ పనులకు వెళ్తోంది. – కాళేశ్వరం

భూమి అమ్మి తీర్చేందుకు..



మహబూబాబాద్ జిల్లా కురవి మండలం హరిదాస్‌తండా పంచాయతీ శివారు హర్యాతండాకు చెందిన భూక్య హత్తీరాం(33), భార్య మీన(28) ఎకరన్నర భూమికి తోడుగా మరో ఎకరన్నర కౌలుకు తీసుకుని మూడెకరాల్లో మిరపసాగు చేశారు. గత నెలలో కురిసిన భారీ వర్షాలకు మిరప తోటలో నీటి ఊట పెరిగి వేరుకుళ్లు తెగులు సోకి పంటంతా ఎండిపోయింది. పెట్టుబడికి రూ.2.50 లక్షలు, అంతకుముందు చేసిన పాత అప్పులు రూ.4 లక్షలు తీర్చడం కష్టమని భావించిన హత్తీరాం మనస్తాపంతో సెప్టెంబరు 6న పురుగు మందుతాగి ఆత్మహత్యకు పాల్పడ్డారు. నాటి నుంచి మీన కుటుంబ బాధ్యతను తీసుకుని రూ.40 వేలు అప్పు చేసి మళ్లీ మిరప సాగు చేస్తోంది. అప్పులు తీర్చడానికి 20 గుంటల భూమిని విక్రయించాలని అనుకుంటున్నానని రోదిస్తూ చెప్పింది. – కురవి

పరిష్కారాలు ఇలా..

- వాతావరణ ఆధారిత బీమా పథకాన్ని ప్రభుత్వం అమలు చేసి అకాల వర్షాలకు పంట నష్టపోయిన రైతులకు పరిహారం అందించి ఆదుకోవాలి
- ప్రత్యామ్నాయ పంటలకు మద్దతు ధర ప్రకటించి రైతులకు భరోసా కల్పించాలి.
- మిర్చి, పత్తి పరిశోధన కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులకు ముందస్తు సూచనలు చేయాలి.
- ఎరువులు, పురుగు మందుల ధరలు నియంత్రించి రైతులపై భారాన్ని తగ్గించాలి
- ప్రకృతి సేద్యాన్ని ప్రోత్సహించాలి.

రైతులు ఆత్మస్థైర్యం కోల్పోవద్దు

- విజయ్ భాస్కర్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి, భూపాలపల్లి

వ్యవసాయంలో ఒడుదొడుకులు సహజం.. అనుకున్న దిగుబడి రాకపోవడం, అకాల వర్షాలు, వరదలతో పంట మునగడం వంటి సందర్భాల్లో ఆత్మస్థైర్యం కోల్పోవద్దు. అవసరమైన సలహాలు, సూచనలు అందించడానికి వ్యవసాయ శాఖ తరపున సిద్ధంగా ఉన్నాం. చాలా మంది అన్నదాతలు అర్హత ఉండీ రైతు బీమాకు దరఖాస్తు చేసుకోవడం లేదు.. పంట సాగుకు సంబంధించి అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నాం.

విప్లవ సాంస్కృతిక ఉద్యమంతోనే మార్పు


మాట్లాడుతున్న జాలన్న, వేదికపై నాగన్న, గోవర్ధన్, తదితరులు

నర్సంపేట, న్యూస్‌టుడే: దేశంలో పెచ్చరిల్లుతున్న హిందూ బ్రాహ్మణీయ ఫాసిస్టు, భూస్వామ్య సంస్కృతికి ప్రత్యామ్నాయంగా సాంస్కృతిక ఉద్యమాల నిర్మాణంతో ముందుకు సాగాలని అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్.జాలన్న, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు నాగన్న పిలుపునిచ్చారు. నర్సంపేటలోని రాయల రమేశ్ నగర్(సిటిజన్స్ క్లబ్)లో ఆదివారం జరిగిన అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర జనరల్ కౌన్సిల్‌లో వారు పాల్గొని మాట్లాడారు. సామ్రాజ్యవాద, పెట్టుబడిదారీ, భూస్వామ్య సంస్కృతికి వ్యతిరేకంగా బలమైన విప్లవ సాంస్కృతిక ఉద్యమాన్ని నిర్మించి.. తద్వారా ప్రజలను జాగృతం చేయాలన్నారు. ప్రజా కళలు అంతరించడం వల్ల ఎదురవుతున్న సమస్యలను వివరించారు. 'కళ కాసు కోసం కాదని.. అది ముమ్మాటికి ప్రజల కోసమని' పేర్కొన్నారు. విప్లవ సాంస్కృతిక ఉద్యమం కోసం పోరాడి అమరులైన వారికి జోహార్లు అర్పించారు. అంతకుముందు అమరవీరుల స్థూపం కూడలి నుంచి అంబేడ్కర్ కూడలి మీదుగా సభావేదిక వరకు ప్రదర్శనగా వచ్చారు. సభలో సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకుడు గోవర్ధన్, ఆహ్వాన సంఘం నాయకులు డా.జగదీశ్వర్, ఐలయ్య, ప్రముఖ కవి, రచయిత యోచన, పీవైఎల్ రాష్ట్ర కార్యదర్శి రాజేందర్, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి అనురాధ, అరుణోదయ సమాఖ్య నాయకులు అలీ, కోటేశ్వర్‌రావు, ఆహ్వాన సంఘం సభ్యులు, కళాకారులు పాల్గొన్నారు.

విద్యార్థులను తీర్చిదిద్దడంలో గురువుల పాత్ర కీలకం


మాట్లాడుతున్న మంత్రి సీతక్క, చిత్రంలో ఎమ్మెల్యే నాయిని

వరంగల్ విద్యావిభాగం, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను తీర్చిదిద్దడంలో గురువుల పాత్ర కీలకమని మంత్రి సీతక్క అన్నారు. హనుమకొండలోని తితిదే కల్యాణ మండపంలో ఆదివారం రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ ఆధ్వర్యంలో 'భాషాంజలి' పేరిట ఆత్మీయ సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. మంత్రి సీతక్క, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి కార్యక్రమాన్ని ప్రారంభించారు. వారు మాట్లాడుతూ.. తల్లిదండ్రులు పిల్లలకు జన్మనిస్తే ఉపాధ్యాయులు వారి అభ్యున్నతికి పాటుపడతారన్నారు. నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వ పాటు పడుతోందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 15 వేల పోలీసు, 1,637 ఇంజినీర్, డీఎస్సీ ద్వారా 11,067 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసినట్లు తెలిపారు. భారాస ప్రభుత్వం పదేళ్ల పాలనలో యువతను మోసం చేసిందన్నారు. నిరుద్యోగులను రెచ్చగొట్టి రాజకీయంగా లబ్ధి పొందేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. పదోన్నతులు పొందిన ఉపాధ్యాయులను సత్కరించారు. శ్రీహరి రచించిన భక్తి గీతాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాస్, శంకర్‌రావు, ఉపాధ్యాయ సంఘాల బాధ్యులు, కార్యవర్గ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యారంగం పట్ల నిర్లక్ష్యం తగదు



మాట్లాడుతున్న కళావతి, చిత్రంలో కమిటీ ప్రతినిధులు, తదితరులు

జనగామ, న్యూస్‌టుడే: విద్యారంగం పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదని తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ జిల్లా అధ్యక్షుడు బి.లక్ష్మయ్య తెలిపారు. కమిటీ జిల్లా సదస్సు ఆదివారం జనగామలో జరిగింది. ఈ సందర్భంగా పాల్గొన్న సంఘం నాయకులు ఇప్ప రాంరెడ్డి, శ్రీనివాస్, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు ఇర్రి అహల్య, జ్వాల పత్రిక సంపాదకురాలు కళావతి, హైకోర్టు న్యాయవాది సాదిక్ అలీ, తదితరులు మాట్లాడారు. రాష్ట్రంలోని 30 వేల పాఠశాలలను నిర్లక్ష్యానికి గురి చేస్తూ మండలానికో సమీకృత ఆవాస విద్యాలయం, నియోజకవర్గానికో అంతర్జాతీయ స్థాయి గురుకుల పాఠశాలను ఏర్పాటు చేయడం విచారకరమన్నారు. బడ్జెట్లో విద్యకు 15 శాతం నిధులు కేటాయిస్తామన్న హామీతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అందుకు భిన్నంగా 7.3 శాతం నిధులే కేటాయించిందన్నారు. విద్యారంగానికి కేంద్రం 20, రాష్ట్రం పది శాతం వంతున నిధులు కేటాయించాలని వారు పేర్కొన్నారు. సదస్సులో వివిధ వర్గాల ప్రతినిధులు, సోమయ్య, రాగళ్ల ఉపేందర్, పి.చంద్రశేఖర్, నాగుల రాజు, చొక్కయ్య, అఫ్సర్, గణేశ్‌లు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రుల్లో టాస్క్‌ఫోర్స్ బృందం తనిఖీలు


ఎంజీఎం ఆసుపత్రిలో సూపరింటెండెంట్ డా.మురళితో చర్చిస్తున్న రాష్ట్ర ప్రత్యేక టాస్క్‌ఫోర్సు సభ్యుడు జాయింట్ డైరెక్టర్ ప్రేమ్‌కుమార్ బృందం

ఎంజీఎం ఆసుపత్రి, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్య సేవలందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక టాస్క్‌ఫోర్సు బృందం వరంగల్, హనుమకొండ జిల్లాలోని పలు ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఆదివారం తనిఖీలు నిర్వహించింది. వైద్యఆరోగ్యశాఖ పరిపాలనా విభాగం జాయింట్ డైరెక్టర్ ప్రేమ్‌కుమార్ ఆధ్వర్యంలో ఈ బృందం వరంగల్ ఎంజీఎం ఆసుపత్రితో పాటు దేశాయిపేట పట్టణ ఆరోగ్య కేంద్రం, హనుమకొండలోని లష్కర్‌సింగారం, పోచమ్మకుంట పట్టణ ఆరోగ్య కేంద్రాలను, హనుమకొండలోని సెంట్రల్ డ్రగ్స్ స్టోర్‌ను తనిఖీ చేశారు. మందుల నిల్వల వివరాలు తెలుసుకున్నారు. ఎంజీఎం ఆసుపత్రిలో మందుల నిల్వల గదిని పరిశీలించిన అనంతరం సూపరింటెండెంట్ డాక్టర్ మురళితో మాట్లాడారు. రోగులకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. ఈ-ఔషధి సక్రమంగా అమలు చేయాలన్నారు. క్షేత్ర స్థాయిలో సిబ్బంది పనితీరు, సమస్యలు గుర్తించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. తనిఖీల్లో ఉస్మానియా ఆసుపత్రి డా. అహ్మద్, వరంగల్, హనుమకొండ డీఎంహెచ్‌ఓలు డా. వెంకటరమణ, డా. లలితాదేవి, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ కృష్ణమూర్తి, సెంట్రల్ డ్రగ్స్ స్టోర్ ఇన్‌ఛార్జి ఫార్మాసిస్టు ఉప్పు భాస్కర్‌రావు తదితరులున్నారు.

పురావస్తు పరిశోధనల రత్నం


పరిశోధనలో గుర్తించిన మట్టిపాత్రలు, పరికరాలు

పాలకుర్తి, న్యూస్‌టుడే: డిస్కవరీ మ్యాన్‌గా ఖ్యాతి పొందాడు ఔత్సాహిక పురావస్తు వేత్త ప్రముఖ చరిత్ర పరిశోధకుడు రెడ్డి రత్నాకర్‌రెడ్డి. రాష్ట్రంలో ఆయన ఏ ప్రాంతాన్ని సందర్శించినా అక్కడి ఆదిమానవుల చారిత్రక ఆధారాలను గుర్తించి అనేక కొత్త అంశాలను ఆసక్తి కలిగించే వస్తువులను వెలుగులోకి తీసుకువస్తున్నారు. 14 ఏళ్లుగా పురావస్తు పరిశోధనతో పాటు భౌగోళిక స్వరూపం, జీవ వైవిధ్య అంశాలను సైతం పరిశోధించడం ఆయన ప్రత్యేకత.

2010 నుంచి ప్రారంభం..

జనగామలో పుట్టి పెరిగిన రత్నాకర్‌రెడ్డి 2010 నుంచి పరిశోధనలు మొదలుపెట్టారు. దేశంలో తొలిసారిగా జనగామ జిల్లా మొత్తాన్ని పరిశోధించి ఆదిమానవుల జిల్లాగా ప్రకటించారు. వారి జీవన విధానాలకు సంబంధించిన ఆధారాలను సేకరించారు. రాతి పనిముట్లతో పాటు మట్టిపాత్రలు, పూసాలు, నాణెలు, శిలాజాలు, నీటిలో తేలే ఇటుకలను గుర్తించారు. తెలంగాణలోని పలు జిల్లాల్లో పరిశీలనలు జరిపారు. చారిత్రక ఆధారాలపై ఓ యూట్యూబ్ ఛానల్ ఏర్పాటు చేసుకొని, అనేక ప్రాంతాలను సందర్శించారు. 33 జిల్లాలపై ఆలోకనం అనే పుస్తకాన్ని రచించారు. గతంలో తెలంగాణ ప్రభుత్వం ఆయనను సన్మానించింది.


జనగామ ఎల్లంలలో రాష్ట్ర కూటుల కాలం నాటి శాసనాన్ని చూపిస్తున్న రత్నాకర్

ప్రాముఖ్యత కలిగిన పురాతన ఆనవాళ్లు..

భువనగిరి గుట్టపై కాకతీయుల కాలం నాటి టైల్స్‌ను గుర్తించి మ్యూజియంలో భద్రపరిచారు. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొత్తకొండ గుట్టపై సిస్తుబండను కనుగొన్నారు. కాకతీయుల కాలంలో పన్ను చెల్లించని వారిని ఈ గుట్టపైకి ఎక్కించేవారని చారిత్రక ఆధారాలు ఉన్నాయి. పాలకుర్తి మండలం గూడూరులో పాటిగడ్డ మీద రెండో శతాబ్దంలో ఇక్ష్వాకుల కాలంలో ముద్రించిన మహా తలవర నాణెం గుర్తించారు. లింగాలఘనపురం మండలం కళ్లెం గుట్టపై మొక్కల చిత్రాలు, రోళ్లబండను వెలుగులోకి తెచ్చారు. వడ్లకొండలో బూడిద సమాధులు, ఇప్పగూడెంలో బుద్ధుడి విగ్రహాన్ని బౌద్ధ తారను గుర్తించారు. బచ్చన్నపేటలో రాష్ట్ర కూటుల కాలం నాటి శాసనంతో పాటు జనగామ మండలం ఎల్లంల, నల్గొండ జిల్లా ఆమనగల్లులో అయ్యనర్ విగ్రహాలను వెలుగులోకి తెచ్చి ఆరాధన సంస్కృతి ఉందని తెలియజేశారు.

ప్రభుత్వం దృష్టి సారిస్తే ప్రయోజనం..

అనేక వస్తువులు, పరికరాలను సేకరించినట్లు రత్నాకర్‌రెడ్డి తెలిపారు. భద్రపరిచే స్థలం లేక తమ నివాసంలో పెట్టినట్లు చెప్పారు. పరిశోధనల్లో సేకరించిన చాలా మట్టిపాత్రలు ధ్వంసమైనట్లు వివరించారు. ప్రభుత్వం సహకరిస్తే తన పరిశోధనలతో భవిష్యత్తు తరాలకు ప్రయోజనం ఉంటుంది.. జిల్లా, రాజధానిలో ప్రత్యేక మ్యూజియం ఏర్పాటు చేసేలా చొరవ తీసుకోవాలని కోరారు.

సేవలు అమరం.. త్యాగం మరవం





● నేటి నుంచి పోలీసు అమరుల సంస్మరణ వారోత్సవాలు

పోలీసులు సమాజ రక్షకులు.. విధి నిర్వహణ కోసం కుటుంబ సభ్యులకు దూరంగా ఉంటూ.. అనేక త్యాగాలు చేస్తారు. ప్రజలందరూ సంతోషంగా పండగలు జరుపుకొంటే ఆ సమయంలో తాము మాత్రం ప్రత్యేక విధులు నిర్వహిస్తారు. శాంతి భద్రత పరిరక్షణలో తమ ప్రాణాలను సైతం లెక్క చేయరు. విధి నిర్వహణలో అమరులైన వారిని స్మరించుకుంటూ ఏటా అక్టోబరు 21 నుంచి 31వ తేదీ వరకు పోలీసు అమరవీరుల వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో జరిగిన ప్రధాన ఘటనలపై 'న్యూస్‌టుడే' కథనం.

వరంగల్‌క్రైం, వర్ధన్నపేట, న్యూస్‌టుడే

రెండు దశాబ్దాల క్రితం ఉమ్మడి వరంగల్ జిల్లాలో నక్సలిజం ఎక్కువగా ఉండేది. పోలీసులు, నక్సల్స్ మధ్య నిరంతరం ఎదురుకాల్పులు జరిగేవి. ఈక్రమంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలో డీఎస్పీ నుంచి హోంగార్డు వరకు 61 మంది పోలీసులు అమరులయ్యారు. ప్రాణత్యాగం చేసిన వారిలో అయిదుగురు హోంగార్డులు ఉన్నారు.

1991లో తొలి పేలుడు..

ఉమ్మడి వరంగల్ జిల్లాలో 1991 జూన్ 15న మొదటిసారిగా మందుపాతర పేలింది. మధ్యంతర ఎన్నికల సమయంలో ఏటూరునాగారం మండలం చెల్పాక గ్రామంలో ఎన్నికల విధుల కోసం వెళ్తున్న సమయంలో మావోయిస్టులు మాటువేసి పేల్చారు. ఈ ఘటనలో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సంతోష్‌కుమార్, ఎస్సై కిషోర్‌కుమార్, హెడ్ కానిస్టేబుల్‌తో పాటు అయిదుగురు సీఆర్పీఎఫ్ జవాన్లు మృతిచెందారు.

జాకారం వద్ద మందుపాతర

ప్రస్తుత ములుగు జిల్లా జాకారం వద్ద 1996 అక్టోబరు నెలలో జరిగిన మందుపాతర పేలుళ్లలో ఏడుగురు పోలీసులు మృతిచెందారు. అప్పటి రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల ప్రచారంలో భాగంగా బందోబస్తుకు వెళుతున్న ట్రాఫిక్ సీఐ ఆకుల దామోదర్‌రావు ప్రయాణిస్తున్న వాహనాన్ని మావోయిస్టులు జాకారం వద్ద పేల్చేశారు. ఇందులో దామోదర్‌రావుతో పాటుగా హెడ్ కానిస్టేబుల్ జి.సారయ్య, కానిస్టేబుళ్లు ఎండీ మహమూద్ ఖాన్, డి.వినయ్‌కుమార్, పోశికంటి రమేశ్, సి.గోవర్ధన్, ఎం.అశోక్ మృతిచెందారు.

● 1992లో స్టేషన్‌ఘన్‌పూర్ విశ్వనాథపురం వద్ద జరిగిన బాంబు పేలుడులో 13 మంది మృతిచెందారు. ఇందులో 12 మంది బీఎస్ఎఫ్ జవాన్లు కాగా ఒకరు డ్రైవర్ ఉన్నారు. ఉమ్మడి జిల్లాలో మావోయిస్టుల అతిపెద్ద విధ్వంసంగా పోలీసులు ఈ ఘటనను పేర్కొంటారు.

ఠాణాలపై దాడులు

ఉమ్మడి వరంగల్ జిల్లాలో మావోయిస్టు ప్రభావం ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో పోలీసులపై దాడులతో పాటుగా ఠాణాలపై దాడులు చేసేవారు. ఏటూరునాగారం మండల కేంద్రంలోని ఠాణాపై 2001 జులై 29న మావోయిస్టులు దాడి చేసి పేల్చేశారు. ఈ ఘటనలో ఠాణాలో పనిచేస్తున్న మోహన్‌నాయక్ మృతిచెందారు. పక్కనే ఉన్న దేవాలయంలోని పూజారితో పాటు అటవీశాఖ సిబ్బంది ఒకరు చనిపోయారు. 1991 ఏప్రిల్ 22న నగరం నడిబొడ్డున ఉన్న సుబేదారి ఠాణాను పేల్చేశారు. హెడ్‌కానిస్టేబుల్ టి.సారయ్య, కానిస్టేబుల్ కోటయ్య మృతిచెందారు. హనుమకొండ ఠాణాపైనా మావోయిస్టులు దాడి చేశారు. త్రుటిలో ప్రాణాపాయం తప్పింది. అప్పటి సీఐ గులాంసందాని లక్ష్యంగా మావోయిస్టులు ఠాణాను పేల్చేశారు. ఈ ఘటనలో ప్రస్తుతం సీసీఎస్‌లో ఏఎస్సైగా పనిచేస్తున్న శివకుమార్ గాయపడ్డారు.

భార్యాబిడ్డలకు టాటా చెబుతూనే..

1997లో వర్ధన్నపేట ఠాణా ఎస్సైగా పనిచేస్తున్న రఘును నక్సల్స్ కాల్చి చంపారు. 1992లో పోలీసు ఉద్యోగంలో చేరిన రఘు ఉమ్మడి జిల్లాలో పలు ఠాణాల్లో ఎస్సైగా విధులు నిర్వహించారు. వర్ధన్నపేట ఎస్సైగా ఉన్న సమయంలో 21-11-1997న మధ్యాహ్నం భోజనం కోసం ఇంటికి వచ్చారు. ఆదేరోజు సాయంత్రం ద్విచక్ర వాహనంపై ఠాణాకు వెళుతూ.. కూతురు, భార్యకు టాటా చెబుతుండగానే ఇద్దరు వ్యక్తులు వచ్చి తుపాకీతో కాల్చారు. దీంతో ఆయన అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. భార్యాబిడ్డల ముందే తుదిశ్వాస విడిచారు. ఆయన వీర మరణానికి గుర్తుగా వర్ధన్నపేట పోలీసు స్టేషన్‌లో కొంత స్థలాన్ని పార్కుగా ఏర్పాటు చేసి రఘు పేరు పెట్టారు.



వర్ధన్నపేట పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన పార్కు

మాటువేసి మట్టుబెట్టారు..

భూపాలపల్లిలో 2001 సంవత్సరంలో సీఐగా పనిచేస్తున్న వివేకానందను నక్సల్స్ కాల్చి చంపారు. 1985లో పోలీసుశాఖలో ఉద్యోగంలో చేరిన వివేకానంద నగరంతో పాటు జిల్లాలో పలు ఠాణాల్లో ఎస్సైగా పనిచేశారు. సీఐగా పదోన్నతి రావడంతో బదిలీపై భూపాలపల్లికి వచ్చారు. సింగరేణి అతిథి గృహంలో రాత్రి భోజనం ముగించుకొని జీపులో ఠాణాకు వెళుతుండగా.. మార్గమధ్యలో మాటువేసిన ఇద్దరు వ్యక్తులు ఒక్కసారిగా వచ్చి నేరుగా సీఐపై కాల్పులు జరిపారు. దీంతో ఆయన అక్కడికక్కడే మృతిచెందాడు.



ప్రభుత్వ ప్రయోజనాలు

- మావోయిస్టుల చేతిలో మృతిచెందిన అమరవీరుల కుటుంబ సభ్యుల్లో అర్హత ఉన్న ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పిస్తారు.
- సర్వీస్ కాలం వేతనం మృతుడి సతీమణికి చెల్లిస్తారు.
- ప్రభుత్వం ప్రకటించిన పరిహారం ఇస్తారు.
- ఇంటి స్థలం మంజూరు చేస్తారు.
- 2005లో పోలీసు అమరవీరుల కుటుంబాల సంక్షేమ సంఘం ఏర్పాటైంది. దీని ద్వారా పలు సంక్షేమ కార్యక్రమాలను చేపడుతున్నారు.

ఏర్పాట్లు చేశాం..



- అంబర్ కిశోర్ ఝా, పోలీసు కమిషనర్

అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను పురస్కరించుకొని రక్తదాన శిబిరాలు, వ్యాసరచన పోటీలు ఓపెన్ హౌస్ లాంటి కార్యక్రమాల నిర్వహణకు ఏర్పాట్లు చేశాం. పోలీసుల విధులు, కర్తవ్యాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తాం. ఈ నెల 22న హనుమకొండ, 23న వరంగల్, 24 మామునూరు, 25వ తేదీ పోలీసు కమిషనరేట్, 26న వర్ధన్నపేట, 27 స్టేషన్‌ఘన్‌పూర్, 28 నర్సంపేట, 29 పరకాల, పోలీసు డివిజన్ కేంద్రాల్లో రక్తదాన శిబిరాలు నిర్వహిస్తాం.

పైపులైన్ పగిలి.. భారీగా తాగునీటి వృథా



ఖమ్మం రోడ్డులో పెట్రోల్ పంపు ఎదుట..



మాజీ ఎమ్మెల్యే నరేందర్ నివాసం ముందు రోడ్డుపై..

వరంగల్ జిల్లా ఇసుకఅడ్డా ఖమ్మం రోడ్డులోని పెట్రోల్ పంపు ఎదుట శనివారం అర్ధరాత్రి బల్దియా ప్రధాన పైపులైన్ పగిలింది. దీంతో పెద్దఎత్తున తాగునీరు వృథా అయ్యింది. అర్ధరాత్రి నుంచి ఆదివారం మధ్యాహ్నం వరకు లీకేజీ వరద ఆగలేదు. భారీ వర్షం పడినట్లు తాగునీరు ఏరులై పారింది. ఇసుకఅడ్డా నుంచి వరంగల్ అండర్‌బ్రిడ్జి మాజీ ఎమ్మెల్యే నరేందర్ ఇంటివరకు నీరు నిలిచింది. లీకేజీని బల్దియా అధికారులు గుర్తించినా.. రంగశాయిపేట, శంభునిపేట, ఖిలావరంగల్, కరీమాబాద్, ఉర్సు, ఎస్ఆర్ఆర్‌తోట, శాంతినగర్ తదితర ప్రాంతాలకు తాగునీటి విడుదల చేయడం వల్ల ప్రధాన పైపులైన్‌కు పడిన లీకేజీని నియంత్రించడం కష్టమైంది. ఆదివారం సాయంత్రం వరకు అన్ని ప్రాంతాలకు నీటి సరఫరా చేశాక.. లీకేజీ నియంత్రణకు చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. మరమ్మతుల నేపథ్యంలో సోమవారం నగరంలోని పలు ప్రాంతాలకు తాగునీటి సరఫరా నిలిపివేస్తున్నట్లు బల్దియా అధికారులు వివరించారు.

– న్యూస్‌టుడే, శివనగర్(వరంగల్)

రైతు ఇంట.. కొలువుల పంట

రఘునాథపల్లి, న్యూస్‌టుడే : ఓ రైతు కుటుంబం ఇంట.. కొలువుల పంట పండుతోంది.. ఆరుగాలం కష్టించి కుమారులను చదివిస్తే వారిద్దరూ పోటీ పడుతూ వరుసగా కొలువులు సాధిస్తున్నారు. జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం కంచనపల్లికి చెందిన కౌడగాని మైసారావు వినోద దంపతుల కుమారులు మనోజ్, మధు ఒకరు మూడు, మరొకరు నాలుగు ఉద్యోగాలు సాధించి ప్రశంసలందుకుంటున్నారు. చిన్న కుమారుడు మధు ఈ ఏడాది జులై 20న సింగరేణి నిర్వహించిన జూనియర్ ఎస్టేట్ అధికారి పరీక్షకు హాజరై ఈ నెల 18న వెలువడిన ఫలితాల్లో ఎంపికయ్యారు. ఆయన 2019లో పంచాయతీ కార్యదర్శిగా ఎంపికై కొంతకాలం విధులు నిర్వహించారు. ఆ వెంటనే న్యాయస్థానం నిర్వహించిన జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగానికి ఎంపికై జనగామ కోర్టులో పనిచేశారు. తర్వాత హైకోర్టు నిర్వహించిన ఎగ్జామినర్ పరీక్షరాసి ఉన్నత ఉద్యోగం సాధించి ప్రస్తుతం అక్కడే విధులు నిర్వహిస్తున్నారు. అంతటితో ఆగకుండా పెద్ద ఉద్యోగంలో చేరాలనే పట్టుదలతో సింగరేణిలో జూనియర్ ఎస్టేట్ అధికారి పరీక్షలో నెగ్గాడు.. పెద్ద కుమారుడు మనోజ్ తమ్ముడు మధుతోపాటే పంచాయతీ కార్యదర్శి కొలువు సాధించారు. మెరుగైన ఉద్యోగం కోసం సాగునీటిపారుదల శాఖలో జూనియర్ అసిస్టెంట్ పరీక్ష రాసి ఎంపికయ్యారు. విధులు నిర్వహిస్తూనే.. సోదరుడిని స్ఫూర్తిగా తీసుకొని మండల గణాంకాధికారి(ఎంపీఎస్‌వో) పరీక్ష రాసి అంతకంటే పెద్ద ఉద్యోగం సాధించారు. ప్రస్తుతం ఆయన దేవరుప్పుల మండల రెవెన్యూ కార్యాలయంలో గణాంక అధికారిగా విధులు నిర్వహిస్తున్నారు. లక్ష్యం, పట్టుదల ఉంటే ఉద్యోగ పరీక్షలు ఎంత కఠినమైనా సాధించవచ్చని సోదరులు మధు, మనోజ్ తెలిపారు.



తల్లిదండ్రులతో కుమారులు మధు, మనోజ్

పర్యాటక ప్రాంతాల సందర్శన

వెంకటాపూర్, న్యూస్‌టుడే: యునెస్కో ఆదేశాల మేరకు రామప్పలో కొనసాగుతున్న శిక్షణ శిబిరంలో పాల్గొన్న వరల్డ్ హెరిటేజ్ వాలంటీర్లు ఆదివారం రామప్ప నుంచి పాండవులగుట్ట, కోటగుళ్ల సందర్శన చేశారు. ఐకోమాస్, ఆర్కియాలజీ సర్వే ఆఫ్ ఇండియా, పర్యాటక శాఖ, కాకతీయ హెరిటేజ్ ట్రస్టు ఆధ్వర్యంలో ఆరో రోజు ఉదయాన్నే యోగా గురువు రాంబాబు ఆధ్వర్యంలో యోగాసనాలు వేశారు. అనంతరం పర్యాటక ప్రాంతాల సందర్శన చేశారు. ముందుగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం పాండవుల గుట్ట చేరుకున్నారు. పాండవుల గుట్ట ప్రాశస్త్యం గురించి స్వయంగా తెలుసుకున్నారు. అక్కడ నుంచి గణపురంలోని కాకతీయ కట్టడమైన కోటగుళ్లను పరిశీలించారు. ఆలయ నిర్మాణం, ప్రత్యేకతను చూశారు. కార్యక్రమంలో కాకతీయ హెరిటేజ్ ట్రస్టు, శిక్షణ శిబిరం ఇన్‌ఛార్జి శ్రీధర్‌రావు, అసిస్టెంట్ టూరిజం ప్రమోషన్ ఆఫీసర్ కుసుమ సూర్యకిరణ్, పర్యాటక, పురావస్తుశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



గణపురం కోటగుళ్లలో శిక్షణ శిబిరం వాలంటీర్లు

కుటుంబ నిర్ధారణ.. 75 శాతమే!

● 12 వేల మంది రైతుల వివరాలు లేవు..

న్యూస్‌టుడే, భూపాలపల్లి కలెక్టరేట్

రుణమాఫీ కాని అన్నదాతలకు ఎదురుచూపులు తప్పడం లేదు.. రాష్ట్ర ప్రభుత్వం రూ.2 లక్షల రుణాలు మాఫీ చేయగా.. చాలా మందికి వర్తించలేదని ఆందోళన వ్యక్తమైంది. ఈ నేపథ్యంలో అర్హులైన ప్రతి ఒక్కరికి రుణమాఫీ జరగాలనే ఉద్దేశంతో ప్రభుత్వం వ్యవసాయ శాఖ అధికారులతో కుటుంబ నిర్ధారణ కార్యక్రమాన్ని నిర్వహించింది. మండలాల వారీగా నిర్దేశించిన లక్ష్యం మేరకు ఇంటింటికీ తిరుగుతూ కార్యక్రమం చేపట్టారు. శనివారంతో ఈ కార్యక్రమం పూర్తికాగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 75 శాతమే పూర్తయినట్లు అధికారులు చెబుతున్నారు. అత్యధికంగా భూపాలపల్లి జిల్లాలో 81 శాతం జరగ్గా, అత్యల్పంగా మహబూబాబాద్ జిల్లాలో 60 శాతమే పూర్తి చేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా మొత్తం 48,297 కుటుంబాలకు గాను 36,279 కుటుంబాల నిర్ధారణ పూర్తయింది.. ఇంకా 25 శాతం మిగిలిపోవడం గమనార్హం.. వారందరికీ రుణ మాఫీ కానట్లేనని అధికారులు అంటున్నారు. మరోవైపు వందశాతం పూర్తి చేయడంలో అధికారులు నిర్లక్ష్యం చేశారని, అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తే పూర్తయ్యేదని అన్నదాతలు అంటున్నారు.

రూ.2312.01 కోట్ల రుణమాఫీ

రుణమాఫీకి సంబంధించి మూడు విడతల్లో ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా 2.63 లక్షల మంది రైతులకు రూ. 2312.01 కోట్లను మాఫీ చేశారు. అత్యధికంగా మహబూబాబాద్ జిల్లాలో 59,140 మంది అన్నదాతలకు రూ. 516.91 కోట్లు, అత్యల్పంగా ములుగు జిల్లాలో 18,696 మంది రైతులకు రూ. 165.53 కోట్లు మాఫీ అయ్యాయి.

క్షేత్రస్థాయిలో ఇలా..

రైతు పంట రుణమాఫీ కార్యక్రమానికి సంబంధించి పథకానికి అర్హులై ఉండి రేషన్ కార్డు లేకపోవడంతో రుణమాఫీ చాలా మంది రైతులకు వర్తించలేదు. దీంతో వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో తిరుగుతూ అర్హులైన కుటుంబాల నిర్ధారణ చేపట్టారు. రైతులకు ముందస్తు సమాచారం అందించి పంచాయతీ, రైతు వేదికల్లో రేషన్ కార్డులేని కుటుంబ సభ్యుల నిర్ధారణ చేపట్టారు. కుటుంబ సభ్యులందరితో సెల్ఫీ తీసుకుని ఆ వివరాలను వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేశారు.

ఉమ్మడి జిల్లాలో కుటుంబ సభ్యుల నిర్ధారణ వివరాలు

జిల్లా	కుటుంబ సభ్యుల లక్ష్యం	నమోదు	శాతం	రుణమాఫీ పొందిన రైతులు	రుణం మొత్తం (రూ. కోట్లలో)
హనుమకొండ	8359	6934	79.30	49598	408.18
భూపాలపల్లి	5815	4713	81.04	22357	277.31
వరంగల్	8252	6263	75.90	59640	474.76
జనగామ	9947	7762	78.03	54458	469.32
మహబూబాబాద్	10937	6652	60.82	59140	516.91
ములుగు	4987	3955	79.30	18696	165.53

● జిల్లా ● కుటుంబ సభ్యుల లక్ష్యం ● నమోదు ● శాతం ● రుణమాఫీ పొందిన రైతులు ● రుణం మొత్తం (రూ. కోట్లలో)



భూపాలపల్లిలో కుటుంబ నిర్ధారణ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయశాఖ అధికారి

పూర్తికాకపోవడానికి కారణాలివే..

- సంబంధిత వ్యవసాయశాఖ అధికారులు గ్రామానికి వెళ్లిన సందర్భంలో సదరు రైతు కుటుంబం ఇతర ప్రాంతాల్లో ఉండటం.. వారికి సమాచారం అందించినా రేపు, మాపు అంటూ దాటవేస్తుండటం.
- రుణమాఫీ మరణించిన వ్యక్తులపై ఉండటంతో వారి మరణ ధ్రువపత్రం అందించడంతో పాటు ఆధార్ కార్డు మ్యాచ్ కావాల్సి ఉంటుంది. మరణించిన వ్యక్తి ధ్రువపత్రం సదరు కుటుంబ సభ్యులు సకాలంలో అందించకపోవడం.
- రుణమాఫీలో విదేశాల్లో ఉంటున్న వారి పేర్లు కూడా ఉన్నాయి. అలాంటి వారు ఇక్కడకు వచ్చి కుటుంబ సభ్యుల నిర్ధారణ చేసుకునేందుకు ఆసక్తి చూపకపోవడం.
- ఈ విషయమై జిల్లా వ్యవసాయశాఖ అధికారి విజయ్‌భాస్కర్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరికీ కుటుంబ నిర్ధారణకు సంబంధించి సమాచారం అందించినా స్థానికంగా లేకపోవడం, ఆధార్ సమస్య, ఆదాయ పన్ను కడుతున్నవారు ముందుకు రాలేకపోయారని అన్నారు.

అండర్-23 క్రికెట్ పోటీలు ప్రారంభం

వరంగల్ క్రీడా విభాగం, న్యూస్‌టుడే: వరంగల్ క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అండర్-23 క్రికెట్ పోటీలు ఆదివారం ప్రారంభమయ్యాయి. హనుమకొండ రెడ్డిపురంలోని టీవీవీ సుఖంత్ మైదానంలో నిర్వహించిన పోటీలకు వరంగల్, హనుమకొండ, జనగామ, ములుగు, భూపాలపల్లి, మహబూబాబాద్ జిల్లాలకు చెందిన జట్లు హాజరయ్యాయి. ముఖ్య అతిథిగా వరంగల్ పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి హాజరై పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హైదరాబాద్‌కు దీటుగా వరంగల్‌లో క్రికెట్ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఓరుగల్లులో అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన మైదానం నిర్మాణం ఆవశ్యకతను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానన్నారు. అనంతరం ఆయన క్రికెట్ ఆడి సందడి చేశారు. వరంగల్ క్రికెట్ సంఘం అధ్యక్షుడు ప్రవీణ్‌గౌడ్, కార్యదర్శి శ్రీనివాస్, రఘురాం, ఉపేందర్, వెంకటేశ్వర్‌రావు, అభినవ వినయ్, మట్టెడ కుమార్, ప్రభాకర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

మహబూబాబాద్ జట్టు గెలుపు

హనుమకొండ రెడ్డిపురంలోని టీవీవీఎస్ మైదానంలో జరిగిన మ్యాచ్‌లో వరంగల్, మహబూబాబాద్ జట్లు నువ్వానేనా అన్నట్లు పోటీపడ్డాయి. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన వరంగల్ జట్టు 29.3 ఓవర్లలో 123 పరుగులకు ఆలౌట్ అయ్యింది. మహబూబాబాద్ జట్టు 30 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 124 పరుగులు చేసి విజయం సాధించింది.

హనుమకొండ ఘన విజయం

మొగిలిచర్ల మైదానంలో జరిగిన మరో మ్యాచ్‌లో హనుమకొండ, జనగామ జిల్లా జట్లు పోటీపడ్డాయి. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన హనుమకొండ జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 307-10 పరుగులు చేసింది. జట్టులో రోహిత్‌రెడ్డి 84, వశిష్ఠ 49 పరుగులతో రాణించారు. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన జనగామ జట్టు 27 ఓవర్లలో 128 పరుగులకే కుప్పకూలింది.



ఆట ఆడేస్తా!

ములుగు జిల్లా తాడ్వాయి మండలం బయ్యక్కపేటలో ఆదివారం మంత్రి సీతక్క సందడిచేశారు. బాల్య స్నేహితురాలి కుటుంబాన్ని పరామర్శించేందుకు వచ్చిన ఆమె స్థానిక గిరిజన ఆశ్రమ పాఠశాలకు వెళ్లి విద్యార్థులకు మిఠాయిలు పంపిణీ చేశారు. అప్పుడే మైదానంలోకి వచ్చిన పిల్లలతో కలిసి వాలీబాల్ ఆడారు. అనంతరం విద్యార్థుల కోసం వండిన వంటలు పరిశీలించి పరిశుభ్రంగా, రుచిగా వండాలని అక్కడి సిబ్బందికి సూచించారు. – న్యూస్‌టుడే, తాడ్వాయి

దరఖాస్తు గడువు పొడిగింపు

కాజీపేట టౌన్, న్యూస్‌టుడే: ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా పలు ఐటీఐల్లో అడ్వాన్స్ టెక్నాలజీ సెంచరీ (ఏటీసీ) కోర్సులను ఏర్పాటు చేయనుంది. తొలి విడతలో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఏటూరునాగారం, భూపాలపల్లిలోని ప్రభుత్వ ఐటీఐల్లో ఈ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తుల గడువును ఈ నెల 30వ తేదీ వరకు పొడిగించినట్లు ఆర్‌డీడీ సీతారాములు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

చికెన్ ధరలు
(కిలో వెల రూపాయలలో)

వెన్‌కాబ్	
ఫాం:	120
రిటైల్:	142
డ్రెస్డ్:	206
స్కిన్‌లెస్:	234

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి దుర్మరణం

దేవరుప్పుల రూరల్, న్యూస్‌టుడే: ద్విచక్రవాహనంపై అతివేగంగా వస్తూ ఆర్టీసీ బస్సును ఓవర్‌టేక్ చేసే క్రమంలో ఎదురుగా వస్తున్న ట్రాలీ వాహనాన్ని బలంగా ఢీకొనగా, ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతిచెందగా మరో ముగ్గురికి తీవ్ర గాయాలైన సంఘటన జనగామ జిల్లా దేవరుప్పుల మండలం గొల్లపల్లి శివారులో చోటుచేసుకుంది. ఎస్సై సృజన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కర్నూలు జిల్లాకు చెందిన బోయ నర్సింహ(20), వనపర్తి జిల్లా మదనాపురానికి చెందిన చీరోలు భరత్(22)లు కొడకండ్ల మండలం రామన్నగూడెంలో ఓ గుత్తేదారు కింద ప్లంబింగ్ పనులు చేస్తున్నారు. ఆదివారం మధ్యాహ్నం సొంత పనుల నిమిత్తం దేవరుప్పులకు వచ్చే క్రమంలో గొల్లపల్లి శివారు వద్ద రోడ్డు దాటుతుండగా, ఎదురుగా వస్తున్న ట్రాలీ వాహనాన్ని ఢీకొనడంతో కింద పడిపోయారు. ప్రమాదంలో ద్విచక్రవాహనంపై ఉన్న బోయ నర్సింహ, చీరోలు భరత్ సంఘటన స్థలంలోనే మృతి చెందగా, ట్రాలీలో ప్రయాణిస్తున్న కొంగరి భాస్కర్, రాపాక రేణుక, రాపాక ఉప్పలయ్యకు తీవ్రగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు, ప్రయాణికులు పోలీసులకు సమాచారం అందించారు. వారు అక్కడికి చేరుకొని క్షతగాత్రులను, మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం జనగామ ఏరియాసుపత్రికి తరలించారు. మృతుల కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

రాకపోకలు సాగించేదెలా..?


మంథోనిగూడెం, మాణిక్యపురం మధ్య రోడ్డు..

లింగాలఘనపురం మండలంలోని మంథోనిగూడెం మాణిక్యపురం గ్రామాల మధ్యలో రోడ్డు వర్షం పడితే బురదమయమై రాకపోకలకు ఇబ్బందిగా మారింది. గ్రామస్థులు, రైతులు నిత్యం ఈ రోడ్డుపై రాకపోకలు సాగిస్తుంటారు. ప్రభుత్వాలు, పాలకులు మారినా సమస్యను పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు, ప్రజాప్రతినిధులు పరిశీలించి రోడ్డును పునరుద్ధరించాలని కోరుతున్నారు. – న్యూస్‌టుడే, లింగాలఘనపురం



భూమికి పచ్చని రంగేసినట్టు!

లింగాలఘనపురం, న్యూస్‌టుడే: మండలంలోని చీటూరు గ్రామ చెరువు ఆయకట్టు పొలాలు ఇవి. చెరువులో నీరు లేకున్నా వర్షాధారంగా, బోరుబావుల నీటితో వరి సాగు చేశారు. చెరువు కట్ట నుంచి కోలుకొండ గుట్ట వరకు పంట పొలాలు ప్రకృతికి పచ్చని రంగులద్దాయి.

కూలితే ప్రమాదమే



లింగాలఘనపురం, న్యూస్‌టుడే: చీటూరులోని దర్గామాత ఆలయం సమీపంలోని విద్యుత్తు స్తంభం ఒక వైపు ఒరిగి ప్రమాదకరంగా మారింది. దీంతో గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. పరిశీలించి పరిష్కరిస్తామని విద్యుత్తు శాఖ ఏఈ తురుగొండ శంకరయ్య 'న్యూస్‌టుడే' కు తెలిపారు.

ప్రధాన రహదారి గుంతలమయం

నర్మెట్ట మండల కేంద్రం నుంచి మరియాపురం గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి గుంతలమయంగా మారింది. ఈ దారి గుండా నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. రాత్రిళ్లు ఆదమరిచి ప్రయాణిస్తే పెద్ద ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. సంబంధిత అధికారులు స్పందించి మరమ్మతు పనులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు. – తరిగొప్పుల



మేమున్నాం.. మీకు తోడుగా

జనగామ: 80085 74872
జనగామ అర్బన్: 80749 20132
పాలకుర్తి: 98663 66702
స్టేషన్‌ఘన్‌పూర్: 90521 83243
జఫర్‌గఢ్: 98662 50618
(10 AM TO 1 PM)

పాలకుర్తి, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని ప్రధాన రోడ్లపై ఇసుక, మట్టి పేరుకుపోయింది. వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. - రాజు, పాలకుర్తి

సమాధానం: పంచాయతీ సిబ్బందితో శుభ్రం చేయిస్తా. - వెంకటేశ్వరచారి, పంచాయతీ కార్యదర్శి

తరిగొప్పుల, న్యూస్‌టుడే: తరిగొప్పుల గ్రామం రెండో వార్డు ప్రధాన రహదారి పక్కన పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగి ఇళ్లలోకి దోమలు సంచరిస్తున్నాయి. - స్థానికులు

సమాధానం: రెండు రోజుల్లో సమస్య పరిష్కరిస్తాం. - భాగ్యలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి

మురుగు తొలగింపు

స్పందనకు వందనం

తరిగొప్పుల, న్యూస్‌టుడే: మండలంలోని అబ్దుల్‌నాగారం గ్రామం మూడోవార్డులో మురుగు కాల్వ వ్యర్థాలతో నిండి దుర్గంధం వెదజల్లుతుందని కాలనీవాసులు 'మేమున్నాం.. మీకు తోడుగా' కు తెలియజేశారు. ఈ విషయాన్ని 'న్యూస్‌టుడే' గ్రామ కార్యదర్శి రవీందర్ దృష్టికి తీసుకెళ్లగా సానుకులంగా స్పందించి, సిబ్బందితో శుభ్రం చేయించారు.

జఫర్‌గఢ్, న్యూస్‌టుడే: మండలంలోని తమ్మడపల్లి(ఐ)లో ప్రధాన వీధుల్లో పిచ్చి మొక్కలు పెరిగి దోమల బెడద అధికంగా ఉందని గ్రామస్థులు 'న్యూస్‌టుడే' దృష్టికి తీసుకువచ్చారు. సమస్యను పంచాయతీ కార్యదర్శి రాజేశ్ దృష్టికి తీసుకెళ్లడంతో వారు స్పందించారు. డోజరు ట్రాక్టర్‌తో తొలగించి సమస్య పరిష్కరించారు.

ఉపాధ్యాయుడికి ఎక్స్‌లెన్సు అవార్డు


సోమన్న

బచ్చన్నపేట, న్యూస్‌టుడే: బచ్చన్నపేట మండలం పడమటికేశ్వాపూర్ ఉన్నత పాఠశాలలోని సామాన్యశాస్త్ర ఉపాధ్యాయుడు పెనుగొండ సోమన్నకు రాష్ట్ర స్థాయి 'టీచర్ ఎక్స్‌లెన్సు' అవార్డు దక్కింది. ఈ క్రమంలో ఆదివారం రాత్రి హైదరాబాద్‌లో అవార్డు అందుకున్నట్లు సోమన్న ఒక ప్రకటనలో తెలిపారు. శారద ఎడ్యుకేషనల్ సొసైటీ వారు ఏటా అందిస్తున్న 2024-ఎక్సలెన్స్ అవార్డుకు ఆయన ఎంపిక కాగా, సొసైటీ ఛైర్మన్ పట్నం కమలమనోహర్‌రావు, పీఆర్‌టీయూ వ్యవస్థాపక అధ్యక్షుడు హర్షవర్ధన్‌రెడ్డి చేతుల మీదుగా అవార్డు, మెమెంటోతో సత్కరించారు. బోధనలో నూతన ఒరవడి చేపట్టినందుకు గాను అవార్డు వరించిందని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా సహోపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

రెండో రోజుకు చేరిన కాంగ్రెస్ కార్యకర్తల నిరసన



జఫర్‌గఢ్, న్యూస్‌టుడే: ఇందిరమ్మ కమిటీలో సీనియర్ కార్యకర్తలకు స్థానం కల్పించకుండా అన్యాయం చేశారని, సముచిత స్థానం కల్పించాలని రెండు రోజులుగా జఫర్‌గఢ్‌లో కాంగ్రెస్ కార్యకర్తలు నిరాహార దీక్ష కార్యక్రమాన్ని మాజీ జడ్పీటీసీ సభ్యుడు పట్టపూరి సదయ్యగౌడ్, మాజీ ఉప సర్పంచి, బీసీ సెల్ నాయకుడు నంచర్ల యాదగిరి ఆధ్వర్యంలో చేపట్టారు. కాంగ్రెస్‌లో సుదీర్ఘ కాలంగా పని చేస్తే సీనియర్లను కాకుండా ఎమ్మెల్యే కడియం శ్రీహరి తన వెంట వచ్చిన వారికి స్థానం కల్పించి అసలైన కాంగ్రెస్ కార్యకర్తలకు అన్యాయం చేశారని, తమకు పార్టీ న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో జఫర్‌గఢ్ టౌన్ పార్టీ అధ్యక్షుడు నీలం రాజయ్య, మాజీ ఉప సర్పంచి మంచాల అయిలయ్య, రడపాక రాజ్‌కుమార్, మల్లయ్య, లక్ష్మీనర్సు, యాకయ్య పాల్గొన్నారు.

అసత్య ఆరోపణలు చేస్తే సహించం


మాట్లాడుతున్న రాఘవరావు

పాలకుర్తి, న్యూస్‌టుడే: లకావత్ శ్రీను ఆత్మహత్య చేసుకున్న సంఘటనలో భారాస నేతలు కాంగ్రెస్‌పై అసత్య ఆరోపణలు చేస్తే సహించేది లేదని మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్, కాంగ్రెస్ నేత ఎర్రబెల్లి రాఘవరావు అన్నారు. ఆదివారం మండలంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మాజీ మంత్రి దయాకర్‌రావు వరంగల్ ఎంజీఎంలో బాధిత కుటుంబసభ్యులను పరామర్శించి కాంగ్రెస్ నాయకులే కారణమని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. బాధిత కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి పరామర్శించి అండగా ఉంటామని, భరోసా ఇచ్చారని తెలిపారు. సమావేశంలో పార్టీ బ్లాక్ అధ్యక్షుడు సత్యనారాయణ, మండలాధ్యక్షుడు కుమారస్వామి, నాయకులు కుమార్, యాకాంతరావు, తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమానికి ప్రభుత్వం కృషి


పడమటికేశ్వాపూర్‌లో కేంద్రాన్ని ప్రారంభిస్తున్న శ్వేత

బచ్చన్నపేట, న్యూస్‌టుడే: రైతు సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని చేర్యాల మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్ నల్ల నాగుల శ్వేత అన్నారు. ఆదివారం బచ్చన్నపేట మండలం రామచంద్రాపూర్, కొన్నె, పడమటికేశ్వాపూర్, గంగాపూర్, నాగిరెడ్డిపల్లి, ఇటుకాలపల్లి గ్రామాల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను పీఏసీఎస్ ఛైర్మన్ పులిగిళ్ల పూర్ణచందర్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతులకు ఏకకాలంలో రూ. 2లక్షలు మాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. కార్యక్రమంలో సీఈవో బాలస్వామి, పీఏసీఎస్ వైస్ ఛైర్మన్ మద్దికుంట రాధ, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు నూకల బాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత శిఖరాలకు ఎదగాలి


ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన వారిని సన్మానించిన వంశీధర్‌రెడ్డి

లింగాలఘనపురం, న్యూస్‌టుడే: పేదరికాన్ని జయించి ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన వారిని స్ఫూర్తిగా తీసుకుని ఉన్నత శిఖరాలకు ఎదగాలని జడ్పీటీసీ మాజీ సభ్యుడు గుడి వంశీధర్‌రెడ్డి యువకులను కోరారు. మాణిక్యపురానికి చెందిన సత్యనారాయణ ఇటీవల డీఎస్సీలో ఉపాధ్యాయ ఉద్యోగం, ఆరోగ్యశాఖలో ఉద్యోగం సాధించిన చౌదరపల్లి రాజును ఆదివారం సన్మానించారు. గ్రామంలో ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకున్నట్లు ఉద్యోగార్థులు పేర్కొన్నారు. కార్యక్రమంలో జనగామ మార్కెట్ ఉపాధ్యక్షుడు నర్సింహులు, నాయకులు నాగేందర్, ప్రవీణ్, మోహన్, రాజు, ఆంజనేయులు, విజయభాస్కర్, నారాయణ, శరభారెడ్డి, సుదర్శన్‌రెడ్డి పాల్గొన్నారు.

నిందితుడికి దేహశుద్ధి

దేవరుప్పుల రూరల్, న్యూస్‌టుడే: దేవరుప్పుల ప్రధాన చౌరస్తాలో దొంగతనానికి ప్రయత్నించిన వ్యక్తిని స్థానికులు పట్టుకుని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూర్‌కు చెందిన ఉపేందర్ మండల కేంద్రంలోని ఓ ఎరువుల దుకాణంలోకి చొరబడే ప్రయత్నంలో స్థానికులు గమనించి పట్టుకునే ప్రయత్నం చేశారన్నారు. గమనించిన ఉపేందర్ అక్కడి నుంచి పరారై చెట్ల పొదల్లోకి దాక్కోగా, స్థానికులు పట్టుకొని పోలీసులకు అప్పగించారని తెలిపారు.

బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యేల పరామర్శ


సుభాష్ చందర్‌రెడ్డి మృతదేహానికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

రఘునాథపల్లి, న్యూస్‌టుడే: కాంగ్రెస్ అనుబంధ కిసాన్‌సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఇబ్రహీంపురం గ్రామానికి చెందిన లింగాల సుభాష్ చందర్ రెడ్డి హఠాన్మరణం చెందడంతో ఆదివారం స్టేషన్‌ఘన్‌పూర్, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, నాయిని రాజేందర్ రెడ్డి, ఎంపీ కడియం కావ్య, రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ ఛైర్మన్ సిరిసిల్ల రాజయ్య, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సింగాపురం ఇందిర తదితర నేతలు మృతదేహాన్ని సందర్శించి సంతాపం తెలిపారు. రెండు దశాబ్దాల పాటు పార్టీకి ఆయన చేసిన సేవలను కొనియాడారు. భౌతికకాయం వద్ద సింగపురం ఇందిర కన్నీరు మున్నీరయ్యారు. టీపీసీసీ రాష్ట్ర అధ్యక్షుడు మహేశ్ గౌడ్ చరవాణిలో బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడారు. కార్యక్రమంలో జనగామ మున్సిపల్ మాజీ ఛైర్మన్ వేమళ్ల సత్యనారాయణ, వైస్ ఛైర్మన్ సుధాకర్, బాజాపా జిల్లా అధ్యక్షుడు దశమంత్ రెడ్డి, జనగామ మార్కెట్ కమిటీ ఛైర్మన్ శివరాజ్ యాదవ్, జడ్పీటీసీ మాజీ సభ్యులు జగదీశ్ చందర్ రెడ్డి, రాజారాం, మాజీ ఎంపీపీ మేకల వరలక్ష్మి, పీఏసీఎస్ ఛైర్మన్లు గంగిడి నర్సింహారెడ్డి, చిమలపాటి రవీందర్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కొళ్ల రవి గౌడ్ పాల్గొన్నారు.


జనగామలో మృతదేహానికి నివాళి అర్పిస్తున్న పల్లా రాజేశ్వర్‌రెడ్డి, నాయకులు

జనగామ టౌన్, బచ్చన్నపేట: జనగామ పట్టణంలోని 13వ వార్డు భారాస ప్రధాన కార్యదర్శి తోట సుభాష్ తండ్రి, భవన నిర్మాణ సంఘం గౌరవ జిల్లా అధ్యక్షుడు ప్రకాశ్ ఆదివారం అనారోగ్యంతో మృతి చెందారు. సమాచారం అందుకున్న స్థానిక ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి మృతదేహాన్ని సందర్శించి నివాళి అర్పించి, కుటుంబ సభ్యులకు భరోసానిచ్చారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు. అలాగే బచ్చన్నపేట భారాస నాయకుడు కర్రె కరుణాకర్‌రెడ్డి ఇటీవల విదేశాల్లో గాయపడగా వారి నివాసంలో ఎమ్మెల్యే పల్లా పరామర్శించి, ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు చంద్రారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలను అరికట్టాలి

జనగామ టౌన్, న్యూస్‌టుడే: జనగామ జిల్లా కేంద్రంలో రహదారికి ఇరువైపుల నెలకొల్పిన అక్రమ నిర్మాణాలను మున్సిపల్ అధికారులు తొలగించాలని కేవీపీఎస్ పట్టణ కార్యదర్శి బొట్ల శ్రావణ్ కుమార్ డిమాండ్ చేశారు. పట్టణంలోని ఓ మద్యం దుకాణం ఎదుట ఏర్పాటు చేసిన చిరు దుకాణాలను ఆ సంఘం ప్రతినిధులు ఆదివారం పరిశీలించి, పుర అధికారులు అక్రమ నిర్మాణాలను తొలగించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ఆత్మహత్య కేసులో నలుగురి అరెస్టు

పాలకుర్తి, న్యూస్‌టుడే: పాలకుర్తి పోలీస్‌స్టేషన్‌లో ఆత్మహత్యాయత్నానికి పాల్పడి మృతిచెందిన లకావత్ శ్రీను కేసులో ఆదివారం నలుగురుని అరెస్టు చేసినట్లు వర్ధన్నపేట ఏసీపీ నర్సయ్య, పాలకుర్తి సీఐ మహేందర్ రెడ్డి తెలిపారు. వారు తెలిపిన ప్రకారం.. మండలంలోని టీఎస్‌కే తండాకు చెందిన గుగులోతు హుస్సేన్, గుగులోతు విజయ, నర్సింగాపురం తండా మాలోతు వినోద్, మాలోతు మంగ్తీలను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నామని చెప్పారు. ఆత్మహత్య నేపథ్యంలో లకావత్ సోమన్న ఫిర్యాదు చేయగా, ఆరుగురిపై కేసు నమోదు కాగా ఒకరిని జువెనల్ హోమ్‌కు తరలించామని, మరొకరు పరారీలో ఉన్నట్లు వెల్లడించారు.

24న దుర్గామాత పదహారు పండగ

జనగామ టౌన్, న్యూస్‌టుడే: జనగామలో శ్రీ విజయ దుర్గమాత ఉత్సవాలు జరిగిన నేపథ్యంలో సాంప్రదాయ బద్ధంగా ఈ నెల 24న పదహారు పండగను జరుపుకోవాలని ఆలయ అధ్యక్షుడు పిట్టల సత్యం కోరారు. దేవాలయ ప్రాంగణంలో ఆదివారం కమిటీ సభ్యులు సమావేశం నిర్వహించి, మాట్లాడారు. ఉత్సవాలను విజయవంతం చేసిన ప్రజలు, బంధు మిత్రులకు, సేవలందించిన మున్సిపల్ సిబ్బందికి ఉత్సవ కమిటీ ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు మేడ శ్రీనివాస్, కర్రె శ్రీనివాస్, నీల యాదగిరి, వాంకుడోతు అనిత, ముప్పిడి మల్లేశ్, అరుకాల ప్రభాకర్, పాండు, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

బడుల్లో బాలికా సాధికారత సంఘాలు


దేవరుప్పుల మండలం కామారెడ్డిగూడెం ఉన్నత పాఠశాల బాలికలతో మాట్లాడుతున్న ఉపాధ్యాయురాలు(పాత చిత్రం)

దేవరుప్పుల, న్యూస్‌టుడే: దేశంలో కఠినమైన చట్టాలు, శిక్షలు ఉన్నా ఇంకా కొన్ని ప్రాంతాల్లో బాలికల పట్ల అనుచిత ధోరణితో చూసేవారు అధికంగానే ఉన్నారని, ఈ క్రమంలో బాలికలపై ఆత్మవిశ్వాసం పెంపొందించేందుకు పాఠశాల స్థాయిలోనే 'బాలికా సాధికారత సంఘాల'ను ప్రారంభించాలని విద్యాశాఖ నిర్ణయించింది. పలు ప్రమాణాలను పరిగణనలోకి తీసుకున్న ప్రభుత్వం సగటు ఆడపిల్ల ఎదుర్కొనే ఇబ్బందుల నివారణపై బహుళ ప్రచారం చేసేందుకు ఈ సంఘాలు దన్నుగా నిలవాలని ప్రభుత్వం ఆశిస్తుంది. వచ్చే నెల(నవంబర్) 4వ తేదీలోపు వీటిని ఏర్పాటు చేయాలని ఆదేశించింది.

సంఘాల లక్ష్యాలు ఇలా..

- కౌమార బాలికల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించడంతో పాటు సంఘంలో తోటివారి నుంచి ఎదురయ్యే ఇబ్బందులను ప్రాథమిక దశలోనే ప్రతిఘటించడం సహా పాఠశాల స్థాయిలోనే ఆడపిల్లల్లో కనిపించే శారీరక మార్పుల పట్ల అవగాహన కల్పించడమే కార్యక్రమ ప్రధాన ఉద్దేశం.
- ఆయా సంఘాలకు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఛైర్మన్‌గా, మహిళా ఉపాధ్యాయురాలు, ప్రతి సెక్షన్ నుంచి ఇద్దరు బాలికలు, స్థానిక పోలీసు స్టేషన్‌లోని మహిళా కానిస్టేబుల్ ఎక్స్‌టర్నల్ సభ్యురాలుగా ఉంటారు. వీరంతా నెలకోసారి సమావేశమై బాలికల్లో బిడియం పోగొట్టి మనోధైర్యం కల్పించి ఎలాంటి అనుచితాలు జరిగినా తమ గమనానికి తీసుకురావాలని సూచిస్తారు. ప్రతి మాసంలో జరిగే సమావేశాల్లో ఏడు అంశాలపై అవగాహన కల్పిస్తారు. అండగా ఉంటామనే భావన పెంపొందిస్తారు. అలాగే బడిలో గ్రీవెన్స్‌బాక్స్ ఏర్పాటుచేసి ప్రధానోపాధ్యాయుడి సమక్షంలో వీటిని తెరిచి సమస్యలు తెలుసుకుంటారు.
- జిల్లా స్థాయిలో జిల్లా పాలనాధికారి ఆధ్వర్యంలో మరో కమిటీ ఉంటుంది. పాఠశాల స్థాయిలో బ్యానర్ తగు కరపత్రాల ముద్రణ తదితర ఖర్చుల కోసం రూ.500 లను ప్రభుత్వం అందజేయనుంది. ప్రతినెలా జరిగే సమావేశంలో అందిన సమాచారం తాలూకు పురోగతి, తాజా విషయాలపై ప్రస్తావిస్తారు.


స్టేషన్‌ఘన్‌పూర్‌లో..


రఘునాథపల్లిలో..


లింగాలఘనపురంలో..

భారాస శ్రేణుల రాస్తారోకో

లింగాలఘనపురం, న్యూస్‌టుడే: రైతు భరోసా వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ భారాస నాయకులు ఆదివారం ధర్నా చేశారు. లింగాలఘనపురంలో భారాస మండలాధ్యక్షుడు బస్వగాని శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు ఎడ్ల రాజు, అధికార ప్రతినిధి చౌదరపల్లి శేఖర్, నియోజకవర్గ నాయకుడు చిట్ల ఉపేందర్‌రెడ్డి పాల్గొని జీడికల్ జనగామ రోడ్డుపై బైఠాయించారు.

జఫర్‌గఢ్: జఫర్‌గఢ్‌లో ఆదివారం భారాస ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. వాహనాలు నిలిచిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. సీఎం దిష్టిబొమ్మను దహనం చేసేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. నాయకులు మహేందర్‌రెడ్డి, జయపాల్‌రెడ్డి, కుమార్, నజీర్, యాదగిరి, నరేశ్, ధనుంజయ, కృష్ణ, సామిరెడ్డి, తిరుమల్, సంపత్, చందు, రాజు, రవి పాల్గొన్నారు.

రఘునాథపల్లి: రఘునాథపల్లిలో భారాస శ్రేణులు రాస్తారోకో నిర్వహించారు. మండలాధ్యక్షుడు వారాల రమేశ్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు నిరసన తెలిపారు. ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ మాజీ సభ్యురాలు బానోతు శారద, జిల్లా యువజన కమిటీ సభ్యుడు గూడ కిరణ్, నాయకులు యాకయ్య, రాజయ్య, పెద్ద గోని రాజు, భరత్ కుమార్, కొంరయ్య, కుమార్, మహ్మద్ రంజాన్, ఉప్పలయ్య, ఇంగ్లె నరసింగరావు పాల్గొన్నారు.

బచ్చన్నపేట: కాంగ్రెస్ ప్రభుత్వం రైతు వ్యతిరేకి అని, ప్రభుత్వం ఏర్పడి పది నెలలు అవుతున్నా రైతు భరోసా ఇవ్వకపోవడం సరికాదని భారాస మండలాధ్యక్షుడు బోడిగం చంద్రారెడ్డి, పీఏసీఎస్ ఛైర్మన్ పులిగిళ్ల పూర్ణచందర్ అన్నారు. ఆదివారం బచ్చన్నపేట చౌరస్తాలో భారాస ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి, మాట్లాడారు.. కార్యక్రమంలో పార్టీ మహిళా మండల అధ్యక్షురాలు మద్దికుంట రాధ, నాయకులు కనకయ్యగౌడ్, మల్లారెడ్డి, వేణుగోపాల్, తదితరులు పాల్గొన్నారు.


జఫర్‌గఢ్‌లో..


బచ్చన్నపేటలో..

ఆర్టీసీకి కేటాయించిన స్థలాన్ని పరిరక్షించండి


మాట్లాడుతున్న సోమయ్య

జఫర్‌గఢ్, న్యూస్‌టుడే: జఫర్‌గఢ్‌లో తెదేపా హయాంలో 1989లో ప్రయాణికుల సౌలభ్యం కోసం స్థానిక రాజపుత్ర (బొందిలి) సామాజిక వర్గానికి చెందిన వారు ఉచితంగా స్థలం కేటాయించడంతో అప్పటి ప్రభుత్వం బస్సు షెల్టర్ నిర్మించింది. శిథిలావస్థకు చేరడంతో మన ఊరు మన ప్రగతి కార్యక్రమంలో కూల్చివేశారు. ఈ స్థలంలో నూతనంగా షెల్టర్ నిర్మించేందుకు ప్రయత్నాలు చేస్తుండగా భూ యజమానుల నుంచి ఒత్తిడి రావడంతో నిర్మాణ పనులు మొదలు పెట్టకుండా వదిలేశారు. దీంతో ఆ సామాజిక వర్గానికి చెందిన వారు స్థలం చుట్టూ ఆదివారం కంచె వేశారు. విషయం తెలుసుకున్న సీపీఎం, భారాస, కాంగ్రెస్ కార్యకర్తలు సంఘటన స్థలానికి చేరుకుని నిరసన వ్యక్తం చేశారు. దాతలు ఇచ్చిన స్థలంలో బస్సు షెల్టర్ నిర్మిస్తే కొందరు రాజకీయ నాయకుల ఒత్తిడితో కూల్చివేసి ఇప్పుడు చుట్టూ కంచెను ఏర్పాటు చేసుకున్నారని తెలిపారు. స్థలం అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు రాపర్తి సోమయ్య, భారాస మండలాధ్యక్షుడు జయపాల్‌రెడ్డి, బీసీ సెల్ నియోజకవర్గ కోఆర్డినేటర్, భారాస గ్రామ శాఖ అధ్యక్షుడు శ్రీధర్, సీపీఎం నాయకుడు సుధాకర్ ఉన్నారు.

ఏటీసీలో ప్రవేశాలకు ఆహ్వానం

జనగామ, న్యూస్‌టుడే: సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ(ఐటీడీఏ) ఏటూరునాగారం ఆధ్వర్యంలో ఉమ్మడి వరంగల్ పరిధిలో పదోతరగతి ఉత్తీర్ణులైన గిరిజన బాల బాలికలు ఐటీడీఏ ఏటూరునాగారంలోని అడ్వాన్సు టెక్నికల్ సెంటర్(ఏటీసీ)లో 2024-25 విద్యా సంవత్సరానికి ప్రవేశాలు కల్పించనున్నారు. పలు అడ్వాన్స్ కోర్సుల్లో ప్రవేశాలు కల్పించనున్నట్లు ఐటీడీఏ పీవో కార్యాలయం ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొంది. హనుమకొండ గిరిజన భవన్లో ఈ నెల 23న, మహబూబాబాద్ గిరిజన భవన్లో 25న, ములుగు గిరిజన భవన్‌లో ఈ నెల 26న ఎంపిక ప్రక్రియ జరుగుతుందని, ప్రవేశ పరీక్షకు హాజరయ్యే వారు పదో తరగతి మెమో, బోనఫైడ్, టీసీ, ఆధార్, కుల ధ్రువీకరణ పత్రాలు వెంట తీసుకురావాలని సూచించారు.

ఉత్సాహంగా వాలీబాల్ ఎంపిక పోటీలు


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న డీఈఓ జ్ఞానేశ్వర్

వరంగల్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: వరంగల్ ఎస్‌జీఎఫ్ఐ(స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా) ఆధ్వర్యంలో నిర్వహించిన వాలీబాల్ ఎంపిక పోటీలు ఉత్సాహంగా జరిగాయి. ఆదివారం హనుమకొండ జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలోని వాలీబాల్ కోర్టులో నిర్వహించిన పోటీలకు ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన బాలబాలికలు హాజరయ్యారు. ముఖ్య అతిథిగా వరంగల్ జిల్లా విద్యాశాఖ అధికారి జ్ఞానేశ్వర్ హాజరై పోటీలను ప్రారంభించారు. ప్రతిభ ఆధారంగా అండర్-17 విభాగంలో బాలబాలికల ఉమ్మడి వరంగల్ జిల్లా జట్లను ఎంపిక చేస్తామని వరంగల్ జిల్లా ఎస్‌జీఎఫ్ఐ కార్యదర్శి సారంగపాణి తెలిపారు. కార్యక్రమంలో వరంగల్, హనుమకొండ జిల్లాల పీఈటీ సంఘాల అధ్యక్షులు వెంకటేశ్వర్లు, ప్రభాకర్‌రెడ్డి, రఘువీర్, పీఈటీలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రానికి మెష్ డోర్ల వితరణ

రఘునాథపల్లి, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని రైల్వేస్టేషన్ ప్రాంతంలోని అంగన్‌వాడీ కేంద్రానికి స్థానిక వెలుగు జ్యోతి యువజన సంఘం ఆదివారం మెష్ డోర్లను అందజేశారు. వితరణ చేసినందుకుగాను ఐసీడీఎస్ పర్యవేక్షకురాలు సరస్వతి, అంగన్‌వాడీ టీచర్ అరుణ సంఘ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

సంక్షిప్తంగా

గౌడ సంఘం అధ్యక్షుడిగా నారాయణ



స్టేషన్‌ఘన్‌పూర్, న్యూస్‌టుడే: మండలంలోని సముద్రాల గ్రామ కల్లుగీత కార్మిక గౌడ సంఘం అధ్యక్షుడిగా వీరగోని నారాయణ గౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా సముద్రాల యాదగిరి, సభ్యులు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ.. తన ఎన్నికకు సహకరించిన సంఘం సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సంఘం సభ్యులను స్టేషన్‌ఘన్‌పూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ బాస్కుల కిరణ్ ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గుండబోయిన వెంకటేశ్వర్లు, గట్టుమూర్తి, వీరగోని అశోక్, రాజు, యాదగిరి తదితరులు పాల్గొన్నారు,

పల్లెలకు బస్సు సౌకర్యం కల్పించాలి

బచ్చన్నపేట, న్యూస్‌టుడే: మండలంలోని గంగాపూర్, నాగిరెడ్డిపల్లి గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించాలని సీపీఎం మండల కార్యదర్శి బెల్లకొండ వెంకటేశ్ అన్నారు. ఆదివారం గంగాపూర్‌లో ఆయన కార్యకర్తలతో సమావేశం నిర్వహించి, మాట్లాడారు. ప్రభుత్వం మహిళలకు కల్పించిన ఉచిత బస్సు ప్రయాణం ఈ గ్రామాలకు చేరడం లేదని, బస్సు సదుపాయం కల్పించకపోతే పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. పార్టీ నేతలు రామగళ్ల అశోక్, రాములు, పురుషోత్తం, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

భగవద్గీత సారాంశంపై ప్రచారం

రఘునాథపల్లి, న్యూస్‌టుడే: నేటి సమాజంలో భగవద్గీత జ్ఞానం ఎంతగానో ఉపయోగపడుతుందని త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ప్రతినిధులు ఆదివారం ప్రచారం చేశారు. మండలంలోని ఫత్తేషాపురం, ఇబ్రహీంపురంలో ఆ సంస్థ నిర్వాహకులు గ్రంథాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ప్రతినిధులు దేవేంద్ర, పంచాక్షరి ఉపేందర్, రామ్‌రాజ్ మాట్లాడుతూ.. నేడు భగవద్గీత జ్ఞానాన్ని విస్మరిస్తుండడంతో అధర్మాలు పెరుగుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో యాదగిరి, శంకర్, లక్ష్మీనారాయణ, లింగస్వామి, సుధీర్ ధన్వంతరి, శాంతికుమార్, లత, ధనలక్ష్మి, సుకన్య పాల్గొన్నారు.

నిందితులను శిక్షించాలి


స్టేషన్‌ఘన్‌పూర్‌లో ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

స్టేషన్‌ఘన్‌పూర్, న్యూస్‌టుడే: సికింద్రాబాద్ ముత్యాలమ్మ ఆలయంలో విగ్రహ ధ్వంసం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలవాలని డిమాండ్ చేస్తూ భాజపా అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో నాయకులు నిరసన వ్యక్తం చేసి రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు.

ఉరేసుకొని ఆత్మహత్య


విజయ్ (పాత చిత్రం)

స్టేషన్‌ఘన్‌పూర్, న్యూస్‌టుడే: కడుపు నొప్పి భరించలేక వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని తాటికొండలో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్సై బొల్లం వినయ్ కుమార్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన మారపాక విజయ్(35) ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. కొద్ది రోజులుగా కడుపు నొప్పితో బాధపడుతున్నాడు, ఆసుపత్రిలో చూపించినా తగ్గకపోవడంతో ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకున్నాడు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.